# గమనం

అతిరధి, మహారధి ప్రాణ స్నేహితులు. చిన్నప్పటి నుండి కలిసి చదువుకున్నారు. విజయనగరం పక్కన ఓ పల్లెటూరు వాళ్ళ స్వస్థలం. ఇద్దరూ వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ చేసారు. అతిరధి అసలు పేరు శ్రీనివాస రామానుజం. ఎప్పుడు చూసినా జంట కవుల్లా ఇద్దరూ కలిసి కనిపించడంతో పేర్లు కూడా జంటగానే ఉండాలని ర్యాగింగ్ లో సీనియర్లు 'అతిరధి' అని మార్చారు. ఎవరు అడిగినా అదే చెప్పాలని, లేకపోతే ఇంకా ర్యాగింగ్ చేస్తామని భయపెట్టడంతో అందరికీ అదే పేరుతో పరిచయమయ్యాడు రామానుజం. అదే, మన అతిరధి.
ఏ విషయాన్నైనా నిశితంగా పరిశీలించి, ఎనలైజ్ చెయ్యడం అతిరధి అలవాటు. ఎవరినైనా ఆకట్టుకునేలా మాట్లాడగలగడం, వ్రాయగలగడం మహారధికున్న సామర్ధ్యం.
సినీ రంగంలో స్థిరపడడం ఇద్దరి జీవితాశయం అయినా కుటుంబ బాధ్యతల వల్ల ముందు ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకోవాలని చదువు పూర్తి అయిన వెంటనే ఉద్యోగాల వేటకోసం అందరిలానే ఇద్దరూ హైదరాబాద్ చేరారు. అక్కడ వాళ్ళకి అభినివేష్ పరిచయం అయ్యాడు. పేరుకి తగ్గట్టే మనిషి కూడా వెరైటీకి పెట్టింది పేరు. అపారమైన పుస్తక జ్ఞానం అతని సొంతం. ఐ.ఎ.ఎస్ చెయ్యాలనేది జీవితాశయం. ఆ ప్రిపరేషన్ లో భాగంగా వారానికి ఒకసారైనా అతిరధ, మహారధులతో గ్రూప్ డిస్కషన్ పెడుతూ ఉంటాడు. ప్రశాంతంగా మొదలయ్యే వాళ్ళ డిస్కషన్లు చాలాసార్లు ఉద్రిక్తతలకి దారి తీస్తుంటాయి. ఒకరోజు..

* * *

"ఏంట్రా మహారధి, ఏదో ఆలోచిస్తున్నట్టున్నావు?" నిశ్శబ్దంగా ఉన్న మహారధిని అడిగాడు అతిరధి.
"అదేరా, మనం ఇంజనీరింగ్ పూర్తి చేసి అప్పుడే నాలుగేళ్ళు దాటిపోయింది. పాతికేళ్ళు వచ్చేసాయి. ఇంకా ఒక మంచి ఉద్యోగం దొరకలేదు. ఎంతకాలమని ఇలా ట్యూషన్లు చెప్పుకుంటూ బ్రతుకుతాం? చదువుకుంటూ ఉన్న రోజుల్లో ఎన్నో ఆశలు ఉండేవి. 'అమ్మానాన్నలు ఎంతో కష్టపడి, ఎన్నో త్యాగాలు చేసి మనల్ని చదివించారు. చదువు పూర్తి అయిన తర్వాత వాళ్ళు మళ్ళీ జన్మలో కష్ట పడకుండా చూసుకోవాలి..' ఇలా ఎన్నో అనుకునేవాళ్ళం. ఇప్పుడు మన బ్రతుకు మనం బ్రతకడమే ఎంతో కష్టమైపోతోంది. కలకి నిజానికి ఉన్న తేడా ఇదేనేమో!"
"బాధపడకురా. 'తానొకటి తలిస్తే దైవమొకటి తలిచాడు..' అంటారు కదా. ప్రస్తుతం మన టైం బాగోలేదు. మనం కోరుకున్నది, ఆ దేముడు తలిచింది ఒకటే అయిన రోజు తప్పకుండా విజయం మనదే అవుతుంది. ధైర్యంగా ఉండు."
"అంటే, ఆ రోజు వచ్చేవరకు అలా ఎదురుచూస్తూ ఉండటమేనంటావా?"
" మరి మనం చెయ్యగలిగింది అంతకంటే ఏముంటుంది చెప్పు?"
"అలా అని కాదురా. ఫలితం మనం అనుకున్నట్టు ఉందో లేదో మనకి తెలిసేది ఒక పని మొదలుపెట్టి, అది చివరిదాకా చేసాకనే కదా."
"అవును!"
"తీరా చివరికి అంతా అనుకున్నట్టు జరగకపోతే నిరాశ పడిపోతాం. అందుకే అసలే మీ కోరుకోకుండా, ఇలా జరగాలి అని ఆశించకుండా చెయ్యాల్సిన పనిని చేసుకుంటూ పోవడం మంచిదేమో అనిపిస్తూ ఉంటుంది నాకప్పుడప్పుడూ."
"అది నిజమేరా. కాకపోతే మనం అడవుల్లో లేము. ఫలితం ఆశించకుండా పనులు చెయ్యడానికి. మనిషి ఆశా జీవి. ఫలానా పని చేస్తే ఇంత లాభం వస్తుంది అనే నమ్మకంతోటే, రావాలనే ఆశతోటే ఏ పనైనా చెయ్యడం మొదలుపెడతాడు. ఇక ఫలితం అంటావా అదెప్పుడూ మన చేతిలో ఉండదు. ఉంటుందనుకునేవాడు తప్పకుండా మూర్ఖుడే అవుతాడు."

"నువ్వన్నది ముమ్మాటికీ నిజం. మనిషి ఆశాజీవి. కాకపోతే ఆశతో ఒక పని మొదలుపెట్టడానికి, ఫలితాన్ని దేముడికి వదిలేయడానికి మధ్య చాలా కథ ఉంది. సాధారణంగా ఆశ ఆలోచింపచేస్తుంది. ఆలోచన ప్రయత్నించమంటుంది. ప్రయత్నం పట్టుదలగా మారుతుంది. పట్టుదల ఫలితాన్ని ఆశిస్తుంది. చివరికి ఫలితం మీద ఆ ఆశే కొంపలు ముంచుతుంది. కథలోని ఈ మలుపులు మనం తట్టుకోగలిగితే పరవాలేదు. లేదా ముగింపు అంత అందంగా ఉండదు."

"నిజమే. కానీ పట్టుదల లేనిదే ఫలితం ఉండదు. ప్రయత్నించనిదే పట్టుదల పెరగదు. ఆశ లేనిదే ఆలోచన రాదు."

"హ్హహ్హహ్హ.. బాగుందిరా మన సంభాషణ. ఇంతకీ చివరికి మనం తేల్చిందేమిటి?"

"అసలు ఈ వేదాంతం అంతా మొదలుపెట్టింది నువ్వు. కాబట్టి ముగింపు కూడా నువ్వే చెప్పు."

"నేను చెప్పేది ఏముంటుంది అతిరథీ! మనం జరగబోయేది చెయ్యగలం తప్ప మనం చేద్దామనుకున్నదే అన్నిసార్లూ జరగదు. అందువల్ల మనం అనుకున్నదే జరుగుతుందని ఆశ పెట్టుకోకుండా మనం చేద్దామనుకున్నది సిన్సియర్ గా చెయ్యడం చాలా అవసరం."

"నేను చెప్పేది కూడా ముమ్మాటికీ అదే."

"బాగుందిరా. మొత్తానికి వడ్లగింజలో బియ్యపు గింజ అన్నమాట. ఎక్కడ మొదలయ్యామో అక్కడికే చేరాము."

"అవును."

"అది సరే గానీ సౌమిత్రిగారి అప్పాయింటుమెంట్ సంగతి ఏమైంది? అభినివేష్ ని అడుగుతానన్నావు?"

"మొన్న రాత్రి అడిగాను. 'ప్రస్తుతం ఆయన బిజీగా ఉంటాడు, ఆ కొత్త సినిమా రిలీజు గొడవలో పడి. పది రోజుల్లో చూద్దాం..' అన్నాడు. మళ్ళీ గుర్తు చెయ్యాలి. రాత్రి వెళ్దాం."

"సరే!"

* * *

**(రాత్రి 10 గం.లు, అభినివేష్ రూము)**

కళ్ళజోడు పెట్టుకుని ఏదో పుస్తకానికి అతుక్కుపోయి ఉన్నాడు అభినివేష్. ఇద్దరూ తన దగ్గరికి వెళ్ళి మాట్లాడకుండా నిలుచున్నారు. పది నిమిషాల తర్వాత తల పైకెత్తి చూసి "హాయ్ రా, ఏంటి సంగతులు?" అని అడిగాడు.

"..పెద్దగా ఏమీ లేవురా. ఇందాకా డిన్నర్ చేస్తూ ఉంటే ఒక డిస్కషన్ వచ్చింది మా ఇద్దరి మధ్య. అది ఎంతకీ తెగడం లేదు. సరే నిన్ను కలిస్తే నిజాలు తెలుసుకున్నట్టూ ఉంటుంది, నీకు ఉపయోగంగానూ ఉంటుందని ఇలా వచ్చాం." అన్నాడు మహారథి.

"..సరే, ఇంతకీ డిస్కషన్ దేని గురించి?"

మళ్ళీ మహారథి అందుకున్నాడు "..ఏం లేదురా. మన దేశం చాలా కాలంగా ఎదుర్కొంటున్న ఒక ముఖ్య సమస్య - 'బ్రెయిన్ డ్రెయిన్' గురించి. నా బాధ ఏమిటంటే మన దేశం మేధావులని తయారు చేసే యంత్రంలా మిగిలిపోతోంది. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలు మనవాళ్ళని వాడుకుని ఇంకా అభివృద్ధి చెందుతున్నాయి. మనం ఎప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే మిగిలిపోతున్నాం. దీనిని అరికట్టడానికి మన ప్రభుత్వాలు గట్టి చర్యలు చేపట్టాలని నేను, లేదు, మేధోవలస వల్ల చివరికి మన దేశానికే లాభం, విదేశాలలో స్థిరపడ్డ మనవాళ్ళు బాగా డబ్బు సంపాదించి ఇక్కడ ఉన్న వాళ్ళ తల్లిదండ్రులకి పంపిస్తూ ఉంటారు, దానివల్ల ఇక్కడ ఉన్నవాళ్ళ జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి అని అతిరథి..ఇలా కొనసాగుతూ ఉన్నాయి మా వాదనలు. ఈ విషయంపై నీ అభిప్రాయం ఏమిటి?"

"అబ్బో, మీరు కూడా ఉపయోగకరమైన విషయాలు మాట్లాడుకుంటారన్నమాట. ముందు ఇది సమస్యా కాదా అనేది పక్కన పెట్టి అసలు ఈ పరిస్థితి ఎందుకు వస్తోందో చూద్దాం. మన దేశంలో, ప్రత్యేకించి మన ఆంధ్ర రాష్ట్రంలో తల్లిదండ్రులకి వాళ్ళ పిల్లల చదువుల గురించి కొన్ని నిర్దిష్టమైన

అభిప్రాయాలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ అంటే కేవలం బైపిసి, ఎంపిసి గ్రూపులే. పై చదువంటే కేవలం ఇంజనీరింగ్ లేదా మెడిసిన్. ఇంజనీరింగ్ పూర్తవగానే అమెరికాలో ఎం.ఎస్ చెయ్యాలి. అదవగానే అక్కడే ఉద్యోగం చెయ్యాలి. డాలర్లు సంపాదించాలి. నెమ్మదిగా వంశం మొత్తాన్ని, వీలైతే పక్కింటి వాళ్ళని కూడా అక్కడికి 'లాగెయ్యాలి'. ఆడపిల్ల విషయంలో అయితే డిగ్రీ అవ్వగానే పెళ్ళి. అది కూడా అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వాడితోటే. పెళ్ళైన ఐదేళ్ళవరకు పిల్లలు వద్దు. కాన్పు అమెరికాలోనే జరగాలి. మరి పుట్టిన బిడ్డ అమెరికన్ అవ్వాలి కదా. అందరు తల్లిదండ్రులూ ఇలానే ఉంటారని కాదు. కానీ చాలామంది ఆలోచనలు ఇలానే ఉంటున్నాయి. పైగా మన వాళ్ళకున్న ఇంకొక చెడ్డ అలవాటు పక్క వాళ్ళతో కంపేర్ చేసుకోవడం. పక్కింటి పిల్లాడితో వాళ్ళ పిల్లాడిని పోల్చడం, వాడిలో పోటీ తత్వాన్ని పెంచుతున్నామనుకుంటూ ఒక రకమైన కాంప్లెక్స్ ని పెంచడం. 'వాడికి ఎంసెట్ లో ర్యాంక్ వచ్చింది, నీకు రాలేదు. వాడు జి.ఆర్.ఇ వ్రాసేసాడు, నువ్వింకా వ్రాయలేదు. వాడికి అప్పుడే వీసా వచ్చేసింది, నీకింకా రాలేదు..' ఇలా జీవితంలోని ప్రతీ అడుగూ కంపేరిజన్ వల్లే పడుతూంటే పిల్లల్లో క్రియేటివిటీ ఏం పెరుగుతుంది?"

ఆవేశంగా మాట్లాడుతున్న అభినివేష్ ని మధ్యలో అడ్డుకుంటూ మహారథి "..అవున్రా. నువ్వు చెప్పింది నిజమే. కాకపోతే ప్రతీ స్టూడెంట్ జీవితంలోనూ అలాగే జరగదు. ఉదాహరణకి మన రవి గాడిని తీసుకో. వాళ్ళ నాన్నగారు వ్యవసాయం చేస్తారు. వీడు ఎప్పుడు ఏం అడిగినా కాదనకుండా ఊళ్ళో అప్పో, సొప్పో చేసి డబ్బు పంపించేవారు. వీడు అమెరికా వెళ్తానని ముప్పై వేలు తగలేసాడు. వీసా రాలేదు. తర్వాత జర్మనీ అన్నాడు, లండన్ అన్నాడు, డెన్మార్క్ అన్నాడు. ఒక్క వీసా కూడా రాలేదు. మొత్తం లక్ష రూపాయిల పైన ఖర్చయింది. ఆ అప్పు తీర్చలేక వాళ్ళ నాన్నగారు అక్కడ, జీవితం నాశనమైపోయిందని వీడు ఇక్కడ నిరాశలో మునిగిపోయి ఉన్నారు. నాకసలు అర్ధం కాదు. ఇరవై ఏళ్ళు దాటాకా ఈ దేశంలో ఉండటం ఏదో పాపం అని ఎందుకు అనుకుంటారో.."

మాట్లాడటం ఆపి అతిరథి వైపు చూసాడు మహారథి. మేము మాట్లాడటం అయింది ఇక నువ్వే మిగిలావు అన్నట్టుగా. ఆ చూపు అర్ధమైనట్టుగా అతిరథి మాట్లాడటం మొదలుపెట్టాడు.

"అబ్బో, ఇద్దరూ చాలా ఆవేశం మీద ఉన్నట్టున్నారు. మీరు అన్న ప్రతీ మాటతో నేను ఏకీభవిస్తున్నాను. మనవాళ్ళ ఆలోచనా విధానం చాలా మారాలి. పిల్లలకి క్రియేటివ్ గా ఆలోచించే అవకాశం ఇవ్వాలి. స్టూడెంట్ లు కూడా అమెరికాయే లోకం కాదని తెలుసుకోవాలి. ఆ భ్రమ నుండి బయటకి రావాలి. ఒప్పుకుంటాను. కానీ నేను చెప్పేది ఒకటే. మన ఇంజనీర్లు విదేశాలకి వెళ్ళడం నష్టం అనుకుంటే దానికి బదులుగా మన దేశానికి ఏమైనా లాభం జరుగుతోందా అని ఒక్కసారి ఆలోచించండి. ఇక్కడ ఉంటే ఇరవై, ముప్పై వేలు సంపాదించే ఇంజనీర్లు అమెరికా వెళ్ళి వేలాది డాలర్లు సంపాదిస్తూ వెనక్కి డబ్బు పంపిస్తున్నారు. ఇక్కడ సోషల్ యాక్టివిటీస్ కి డబ్బు సహాయం చేస్తున్నారు. ప్రతీ రోజూ పేపర్ లో చదవడంలేదా ప్రవాసాంధ్రులు చేస్తున్న మంచి పనులు. కంటి ఆసుపత్రులు, స్కూళ్ళు, వంతెనలు కట్టిస్తున్నారని, వాళ్ళు చదివిన కాలేజీలకి, స్కూళ్ళకి డబ్బు పంపిస్తున్నారని ఇలా ఇంచుమించు రోజూ ఏదో ఒక వార్త. ఈ లెక్కలు నా కంటే అభికి బాగా తెలుస్తాయి." అని అందుకోరా అన్నట్టు అభినివేష్ వైపు చూసాడు.

'అది మాత్రం నిజం' అన్నట్టుగా చూస్తూ అభినివేష్ కళ్ళజోడు తీసి, చొక్కాకి తుడుచుకుంటూ మాట్లాడటం మొదలుపెట్టాడు.

"నిజం చెప్పాలంటే నువ్వన్నది కూడా నిజమేరా. ఇక్కడి వర్క్ కల్చర్ కి, అమెరికాలోని వర్క్ కల్చర్ కి చాలా తేడా ఉంది. అలాగే అందుబాటులో ఉన్న వనరుల విషయంలో కూడా ఇక్కడికి అక్కడికి చాలా తేడా ఉంది. ఆ తేడాని సరిగ్గా ఉపయోగించుకుని మన వాళ్ళు ధనవంతులౌతున్నారు. మన వాళ్ళ టాలెంట్ ని ఉపయోగించుకుని ఆ దేశం టెక్నాలజీ రంగంలో ముందుకుపోతోంది. అంతే కాదు. 1985 నుండి ఇప్పటి వరకు సిలికాన్ వ్యాలీ లో మన వాళ్లు కంపెనీలు పెట్టి వందల వేల ఉద్యోగాలు సృష్టించారు. అలా అభివృద్ధి చెందిన మన వాళ్ళు ఇక్కడికి డబ్బు పంపించడం వల్ల మన దేశానికి కూడా లాభం. మీరు పేపర్ లో చదివే ఉంటారు. వినోద్ ఖోస్లా అని, సన్ మైక్రోసిస్టమ్స్ ని స్థాపించినాయన, క్రితం సంవత్సరం ఆయన చదివిన ఢిల్లీ ఐ.ఐ.టి కి ఐదు మిలియన్ డాలర్లు

పిరాళంగా ఇచ్చారు. ఐదు మిలియన్లంటే ఇరవై మూడు కోట్ల రూపాయిలు. మాటలా! ఏమంటావు మహారథి?" అని ఏమీ మాట్లాడకుండా ఉన్న మహారథిని కదుపుతూ అడిగాడు .
తల వంచుకుని నిశ్శబ్దంగా ఇద్దరి మాటలు వింటున్న మహారథి నెమ్మదిగా తల పైకెత్తి ఇద్దరినీ ఒకసారి చూసి అడిగాడు.
"..అదే వినోద్ ఖోస్లా ఆ సన్ మైక్రోసిస్టమ్స్ ని మన దేశంలో స్థాపించి ఉంటే ఎలా ఉండేది?"
ఆ ప్రశ్నకి ఇద్దరూ నిశ్చేష్టులయ్యారు. మాట్లాడకుండా ఉండిపోయిన ఇద్దరినీ చూసి మళ్ళీ మాట్లాడటం మొదలుపెట్టాడు మహారథి.
"సిలికాన్ వ్యాలీ లో మన వాళ్ళు స్థాపించిన కంపెనీల్లో సగమైనా ఇక్కడ స్థాపించి ఉంటే మనలాంటి కొన్ని వేల మంది నిరుద్యోగ ఇంజనీర్లకి ఉద్యోగాలు దొరికేవి. 'నా పక్కింటి వాడు అమెరికా వెళ్ళి, డబ్బు సంపాదించి, వాళ్ల అమ్మానాన్నలకి లక్షలు పంపించాడు. ఆ డబ్బుతో వాళ్ళు ఇల్లు కట్టుకున్నారు, పిల్ల పెళ్ళి చేసారు, వాళ్ళ జీవన ప్రమాణం పెరిగింది.' అని నేను ఆనంద పడగలనురా. కానీ నా కోసం సర్వస్వం త్యాగం చేసిన నా తల్లిదండ్రులకి ఈ రోజు నేను ఒక వెయ్యి రూపాయిలు కూడా పంపించలేని పరిస్థితిలో ఉన్నాను, దానికి కారణం నా దేశంలో వనరులు అందుబాటులో లేకపోవడమే, నేను అమెరికా వెళ్ళకపోవడమే అనేదే నిజమైతే ఆ నిజాన్ని నేను భరించలేనురా."
మాట్లాడటం పూర్తయ్యేసరికి మహారథి కళ్ళనుండి రెండు నీటి చుక్కలు రాలి పడ్డాయి. అది చూసి వెంటనే అతిరథి తన దగ్గరికి జరిగి, మీద చెయ్యి వేసి, ఓదార్పుగా "అయ్యయ్యో, బాధపడకురా. నీ ఎమోషన్స్ ని నేనర్థం చేసుకోగలను. అసలు ఈ టాపిక్ ని అనవసరంగా మొదలుపెట్టాము." అన్నాడు.
అభినివేష్ కూడా మహారథి పక్కకి జరిగి, భుజం మీద చెయ్యి వేసి మాట్లాడకుండా కూర్చున్నాడు. పది నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. వాతావరణాన్ని తేలిక పరచడానికేమో అభినివేష్ మాట్లాడటం మొదలుపెట్టాడు.
"అవునురా మహారథీ! నువ్వు అంత ఎమోషనల్ గా ఉన్నప్పుడు కూడా అంత బాగా ఎలా మాట్లాడగలిగావురా? నీ మాటలు వింటుంటే నాకు కూడా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇప్పుడు చెప్పచ్చో చెప్పకూడదో నాకు తెలియదు కానీ నీకు మాత్రం రైటర్ గా మంచి భవిష్యత్తు ఉందిరా!" అన్నాడు.
ఊహించని ఈ మాటకి అతిరథి షాకయ్యాడు. మహారథి మాత్రం వంచి ఉన్న తలని అలాగే అతిరథి వైపు తిప్పి చిన్నగా నవ్వుతూ చూసాడు. ఏం మాట్లాడాలో అర్థం కాక అతిరథి అలాగే నిశ్శబ్దంగా ఉండిపోయాడు. మహారథి తల పైకెత్తి అభినివేష్ వైపు చూసి "నీ అభిమానానికి చాలా థ్యాంక్స్ రా. రైటర్ అవ్వడానికి నాకేమీ అభ్యంతరం లేదు. నేను వ్రాసినవి డైరెక్ట్ చెయ్యడానికి అతిరథి ఉన్నాడు. ప్రొడ్యూస్ చెయ్యడానికి నువ్వున్నావు. ఇంతకంటే ఏం కావాలి?" అన్నాడు కొంచెం వ్యంగ్యం ధ్వనించేలా.
అభినివేష్ ఏ మాత్రం చలించకుండా "దానిదేముందిరా. తప్పకుండా!" అన్నాడు.
ఈసారి ఇద్దరూ షాక్ తిన్నారు.
వాళ్ళ రియాక్షన్ పట్టనట్టు మాట్లాడటం కంటిన్యూ చేసాడు అభినివేష్.
".. మనలో టాలెంట్ ఉండాలే కానీ దాన్ని నిరూపించుకోవడానికి లక్ష మార్గాలు. మొన్న అతిరథి అడిగాడు సౌమిత్రిగారి అప్పాయింటుమెంట్ కావాలని. వచ్చేవారం ప్రయత్నిద్దాం దాని గురించి. నీ గురించి కూడా చెప్తాను ఆయనకి. కానీ ఈ లోపు ఇద్దరూ ప్రిపేర్ అయి ఉండండి. ఆయన చాలా ఘటికుడు."
అతిరథి మాట్లాడుతూ "నిజమేరా. మీకు టాలెంట్ ఉందని నన్ను నమ్మించండి అని ఆయన అడగవచ్చు. మహారథి అయితే తను వ్రాసినవి చూపించవచ్చు. కానీ మరి నేను?" అని సందేహాన్ని వ్యక్తం చేసాడు.
మహారథి సమాధాన పరుస్తూ "..నిన్ను ఏదో ఒక సినిమా లోని సీను చూపించి అది నువ్వైతే ఎలా

డైరెక్ట్ చేస్తావు అని అడగొచ్చు. కంగారు పడకు. ఒక నాలుగైదు సినిమాలు చూడు వచ్చే వారం రోజుల్లో." అన్నాడు.
మళ్ళీ అభినివేష్ వైపు చూస్తూ "..సరేరా మరి. ఇప్పటికే లేట్ అయింది. నీ టైం చాలా వేస్ట్ చేసాం. మళ్ళీ కలుద్దాం." అంటూ లేచాడు.
"అలాగే రా. నేను నాన్నగారితో రేపు మాట్లాడతాను. ఆయన గురించి నాన్నగారికి బాగా తెలుసు కదా, ఏమైనా సలహా ఇవ్వచ్చు." అన్నాడు అభినివేష్.
అతిరథి కూడా బై చెప్పి లేచాడు.
మొత్తానికి ఓ పనైపోయిందని ఆనందపడుతూ అతిరథ, మహారథులిద్దరూ రూముకి చేరారు.

* * *

వారం రోజులు గడిచాయి. మహారథి తను వ్రాసిన కథలు, కవితలు అన్నీ ఒక ఫైల్ లో పెట్టుకుని ఎప్పుడైనా రెడీ అన్నట్టు ఉన్నాడు. అతిరథి ఇంచుమించు రోజుకొక సినిమా చొప్పున మొత్తం ఆరు సినిమాలు చూసాడు. ఆ రోజు శనివారం. రాత్రి పదకొండు గంటలు దాటింది. బయట చిన్నగా చినుకులు పడుతూ ఉన్నాయి. కాలింగ్ బెల్ మోగడం చూసి ఈ టైంలో ఎవరా అనుకుంటూ కిటికీ లోనుండి చూసాడు అతిరథి. బయట అభినివేష్. పెద్ద గొడుగు వేసుకుని నిల్చొని ఉన్నాడు. 'బాబోయ్ ఏం మోసుకొచ్చాడో ఏంటో' అని కంగారుగా తలుపు తీసాడు అతిరథి.
తలుపు తియ్యగానే గొడుగు తోపాటే లోపలకి వచ్చెయ్యడానికి ప్రయత్నించి కుదరకపోవడంతో దాన్ని ముడిచి లోపలకి వచ్చాడు.
వస్తూనే "గుడ్ న్యూస్ రా. రేపు పొద్దున్న ఎనిమిది గంటలకి అప్పాయింటుమెంట్ దొరికింది. ఇద్దరి గురించి చెప్పాను. అలాగే మాట్లాడదాం రమ్మన్నారు. ఆయన కొత్త సినిమాకి మంచి రిపోర్ట్ వచ్చింది కదా, చాలా హ్యాపీ మూడ్ లో ఉన్నట్టున్నారు." అన్నాడు.
"గుడ్ న్యూస్ రా! రేపు ఏడు గంటలకి మీ ఇంటికొస్తాం అయితే." అన్నాడు అతిరథి.
"వద్దురా. నేనే ఏడున్నరకి మిమ్మల్ని పిక్ చేసుకుంటా. బ్రేక్ ఫాస్ట్ చేసి రెడీగా ఉండండి." అని చెప్పి బయలుదేరాడు అభినివేష్.
తను వెళ్ళాకా మహారథిని అడిగాడు అతిరథి. "ఏరా, రేపు పరవాలేదంటావా? బాగా చెయ్యగలమంటావా? ఈయన అయితే ఇద్దరం ఒకే చోట పని చెయ్యవచ్చు. తన సినిమాలన్నిటికీ స్క్రీన్ ప్లే, డైలాగ్స్, దర్శకత్వం అన్నీ ఆయనే కదా."
"అవును. నువ్వు కంగారు పడకు. మన ప్రయత్నం మనం చేద్దాం. అంతా మంచే జరుగుతుంది." అని ధైర్యం చెప్పి పడుకున్నాడు మహారథి.
తెల్లారింది. అన్న ప్రకారం ఏడున్నర కి వచ్చాడు అభినివేష్, తన చేతక్ బండి మీద. ఇంజన్ ఆపడం ఎందుకు వేస్ట్ అనుకున్నట్టున్నాడు, బయటనుండే గట్టిగా హారన్ మోగించడం మొదలుపెట్టాడు. అది విని టై కట్టుకుంటున్న అతిరథి పరిగెత్తుకుంటూ బయటకి వచ్చాడు. ఫార్మల్ డ్రెస్ లో ఉన్న అతిరథిని చూసి ఆశ్చర్యపోయి అడిగాడు అభినివేష్. "ఏంట్రా, ఏమైనా ఇంటర్వ్యూ అనుకుంటున్నావా? ఫార్మల్ డ్రెస్ లో రెడీ అయ్యావు. నువ్వు వెళ్తున్నది ఒక క్రియేటివ్ జీనియస్ దగ్గరికి. బయట మేకప్ చూసి ఆయన ఇంప్రెస్ అయిపోడు. మామూలు బట్టలు వేసుకో. ఇంకా మాట్లాడితే జుట్టు కొంచెం చెరుపుకో. అడిగితే రాత్రంతా పని చేసానని చెప్పి ఇంప్రెస్ చెయ్యొచ్చు." అని లెక్చర్ ఇచ్చి బండి పక్కన పార్క్ చేసి లోపలకి వచ్చాడు.
లోపల మహారథి రెడీ అయిపోయి 'రాముడు మంచి బాలుడు' టైపులో కూర్చుని ఉన్నాడు. తను రోజూ వేసుకునే బట్టలే వేసుకున్నాడు. చూసి 'బాగుంది' అనుకుంటూ "ఏరా, రెడీ అనుకుంటా." అన్నాడు.
మహారథి 'నేనెప్పుడూ అంతే!' అన్నట్టు మొహం పెట్టి, "ఓ, రెడీ, వెళ్దామా మరి.." అన్నాడు.
"వెళ్దాం. కానీ అతిరథిని బట్టలు మార్చుకోమని చెప్పాను." అని 'ఏంటి, ఇంకా ఇక్కడే నిల్చున్నావు?' అన్నట్టు అతిరథి వైపు చూసాడు.

అతిరథికి మూడ్ లేనట్టుంది మళ్ళీ అన్నీ మార్చుకోవడానికి. అదే చెప్పాడు. "ఒరే, ఇప్పటికే లేట్ అయింది. ఏం పరవాలేదు కానీ వెళ్దాం, పద." అన్నాడు.
'నేను చెప్పాల్సింది చెప్పాను ఇక నీ ఇష్టం..' అన్నట్టు మొహం పెట్టి "సరే ఐతే, పదండి." అని కదిలాడు అభినివేష్.
మొత్తానికి ఎలాగో కష్టపడి ముగ్గురూ ఆ చేతక్ మీద సౌమిత్రి గారి ఇంటికి చేరారు సరిగ్గా ఎనిమిది గంటలకి. గూర్ఖాకి అభినివేష్ బాగా పరిచయం ఉన్నట్టుంది. గేట్ దగ్గర చూడగానే నమస్కారం పెట్టి "నమస్తే సాబ్, సారు ఆఫీస్ లో ఉన్నారు." అని చెప్పాడు.
'నాకిది అలవాటే..' అన్నట్టుగా ఇద్దరి వైపు చూసి బండి బయట పార్క్ చేసి "పదండి." అని లోపలకి నడిచాడు.

* * *

**(సౌమిత్రి గారి ఆఫీసు. ఎనిమిది గంటల ఐదు నిమిషాలు.)**
తెల్లటి లాల్చీ పైజామా వేసుకుని, పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకుని ఏదో వ్రాసుకుంటూ ఉన్నారు సౌమిత్రి గారు.
తలుపు నెమ్మదిగా తట్టి, మెల్లగా తెరిచాడు అభినివేష్. సౌమిత్రి గారు తల పైకెత్తి చూసి "రావయ్యా అభీ. నీ గురించే చూస్తున్నా. నాన్నగారు టెన్నిస్ కి వెళ్ళారా? రా, కూర్చో." అన్నాడు.
అభినివేష్ వెనకే బిక్కు బిక్కుమంటూ ఇద్దరూ లోపలకి వచ్చారు. అభినివేష్ మాట్లాడుతూ "గుడ్ మార్నింగ్ అంకుల్. నాన్నగారు నేను వచ్చేసరికి ఇంకా నిద్ర లేవలేదు. రాత్రి బాగా లేట్ అయినట్టుంది.." అని చెప్పి వీళ్ళని చూపిస్తూ "అంకుల్, నేను చెప్పాను కదా. వీళ్ళే నా ఫ్రెండ్స్. అతిరథి, మహారథి." అని పరిచయం చేసాడు.
ఇద్దరూ రెండు చేతులతో నమస్కారం పెట్టారు. సౌమిత్రి ప్రతి నమస్కారం చేస్తూ గడియారం వైపు చూసాడు. ఇక అతిరథికి భయం పట్టుకుంది. మొదటి ఇంప్రెషనే చెడ్డగా పడితే ఎలారా భగవంతుడా అని ఆందోళన పడుతూ ఆయన వైపే చూడసాగాడు.
ఆయన ఇద్దరినీ కూర్చోమని ఛైర్స్ చూపిస్తూ "ఏం అభీ, ఏమైనా తినొచ్చారా, కాఫీ తాగుతారా?" అని అడిగాడు.
"అబ్బే లేదంకుల్. మేము బ్రేక్ ఫాస్ట్ చేసే వచ్చాం. మరి మీరు?" అన్నాడు.
"నా సంగతి నీకు తెలిసిందేగా. పొద్దున్నే ఐదు గంటలకే మన దినచర్య మొదలవుతుంది. అన్ని పనులూ అయిపోయాయి." అన్నాడు.
మళ్ళీ ఆయనే మాట్లడుతూ "ఏమయ్యా కుర్రాళ్ళూ. సినిమా ఫీల్డ్ లోకి వస్తారా?" అని అడిగాడు ఇద్దరినీ చూస్తూ.
అతిరథి చాలా నెర్వస్ గా ఉండటం గమనించిన మహారథి తనే మొదలు పెడదామని డిసైడ్ అయినట్టున్నాడు. ఛైర్లో కొంచెం ముందుకు జరిగి "అవును సార్. చిన్నప్పటి నుండీ మా ఇద్దరికీ ఇదే గోల్. మాతో చదువుకున్న వాళ్ళు చాలా మంది ఇప్పుడు అమెరికా లో ఉన్నారు. కానీ మేము తెలుగు సినిమాయే మా జీవితం అని గట్టిగా డిసైడ్ అయి ఇక్కడే ఉండిపోయాం. డిగ్రీ పూర్తైన తర్వాత చిన్న ఉద్యోగాలు చేసాం కొంత కాలం. తర్వాత ట్యూషన్లు చెప్పాం. అవకాశం దొరికినప్పుడల్లా రంగంలోకి దూకే ప్రయత్నం చేసాం. కానీ పెద్దగా ఏ ప్రయత్నం ఫలించలేదు. ఇన్నాళ్ళకి మా అభినివేష్ సహాయం వల్ల మిమ్మల్ని కలిసే అవకాశం దొరికింది." అని క్లుప్తంగా ఇద్దరి జీవిత చరిత్ర చెప్పాడు.
అంతా శ్రద్ధగా విని సౌమిత్రి అభినివేష్ వైపు తిరిగి "అభీ, నేను వీళ్ళతో మాట్లాడుతూ ఉంటాను. నువ్వు ఒకసారి టీను రూం కి వెళ్ళి వాడు చదువుకుంటున్నాడో లేదో చూడు. వీడియో గేమ్స్ ఆడుతూంటే డాడీ తో చెప్తానని భయపెట్టు. సరేనా.." అన్నాడు.
'అలాగే అంకుల్!' అని చెప్పి లోపలకి వెళ్ళాడు అభినివేష్.

తను వెళ్ళాకా మళ్ళీ వీళ్ళిద్దరి వైపు చూస్తూ "..అభి మా ఇంట్లో మనిషి లాంటి వాడు. నెలకి మహా అయితే ఒకసారి వస్తాడు. కానీ టీనూ కి తన దగ్గర బాగా అలవాటు. నిజం చెప్పాలంటే ఇప్పుడు మీరు నా ముందు కూర్చోగలిగింది అభి వల్లనే. సరే అదంతా పక్కన పెడదాం. (మహారథి వైపు చూస్తూ) మామూలుగా ఐతే నువ్వు రైటర్ అవుదామని వచ్చావు కాబట్టి నువ్వు వ్రాసిన కథలు, కవితలు చూడాలి. (అతిరథి వైపు చూస్తూ) ఈ అబ్బాయి భవిష్యత్తులో డైరెక్టర్ అవుతానంటున్నాడు కాబట్టి ఏదో సినిమా లోని ఒక సీను చూపించి దాన్ని నువ్వైతే ఎలా డైరెక్ట్ చేస్తావు అని అడగాలి. అవునా?"అని ఇద్దరి ముఖ కవళికలని బాగా అబ్జర్వ్ చేస్తూ అడిగాడు.

సరిగ్గా తామేమనుకున్నామో అదే చెప్పేసరికి ఇద్దరూ ఆశ్చర్యపోయి "అవున్సార్!" అన్నారు ఒకేసారి.

సౌమిత్రి కంటిన్యూ చేస్తూ "కరెక్ట్. కానీ నేనలా చెయ్యను. మీరిద్దరూ పాతికేళ్ళ కుర్రాళ్ళు. మీ నుండి ఏమైనా ఆశించే ముందు నేను చెప్పాల్సింది కొంచెం ఉంది." అన్నాడు.

ఈ మలుపు ఊహించకపోవడంతో ఇద్దరూ ఆసక్తిగా వినసాగారు.

"కొందరికి సినిమా ఒక వ్యాపారం. కొందరికి కళాత్మక వ్యాపారం. ఇంకొందరికి కేవలం కళ. కానీ అందరికీ సినిమా అనేది తమ మనసులోని భావాలని అందమైన రూపంలో వెల్లడించడానికి ఒక అద్భుతమైన మార్గం. తమ ఊహాలోకాన్ని కళ్ళముందు అద్భుతంగా ఆవిష్కరించగలిగే ఒక సాధనం. సాధారణ ప్రేక్షకుడికి సినిమా ఒక వరం. తన బాధలని కాసేపు మర్చిపోయి సేద తీరే వేరే లోకం. అలాంటి సినిమాకి కథ వ్రాయాలన్నా, దర్శకత్వం వహించాలన్నా ఎంతో కృషి చెయ్యాలి. ఎవరో చెప్పినట్టు ఒక సినిమా ఎంత అద్భుత విజయం సాధించినా, ఎలాంటి పరాజయం పాలైనా ఆ సినిమా కథ ఒక మనిషి మైండ్ లో ఒకే ఒక ఆలోచనతో మొదలవుతుంది. చాలా సార్లు ఆ ఆలోచన కి 'ఊహ' ప్రేరణ అవుతుంది. కొన్నిసార్లు నిత్య జీవితంలో ఎదురయ్యే సంఘటనలు కథకుడిని ప్రేరేపిస్తాయి. ప్రేరణ ఎలా పుట్టినా కథనం ఆకట్టుకోవాలంటే కథలోని ప్రతీ మలుపు, పాత్రల సృష్టి, సంభాషణలు అన్నీ..అన్నీ ప్రేక్షకుడి లాజిక్ కి అందేలా ఉండాలి. సినిమా చూసి ఇంటికి వెళ్ళిన ఒక సాధారణ ప్రేక్షకుడు ఒక్కసారి కళ్ళు మూసుకుంటే మొదటి ఫ్రేము నుండి చివరి ఫ్రేము వరకు అంతా కళ్ళకి కట్టినట్లు కనిపించాలి. ఒక మంచి సినిమా చూసాననే అనుభూతి కలగాలి. అలా జరిగినప్పుడు ఒక కథకుడిగా మనం సక్సెస్ సాధించిన వాళ్ళం అవుతాం. కథకుడు అంటే కేవలం కథ వ్రాసేవాడే కాదు. మన మైండ్ లోని ఆలోచన ప్రేక్షకుడి కళ్ళ ముందు అందంగా కనిపించడానికి మధ్యలో మూడు ముఖ్యమైన స్టెప్స్ ఉన్నాయి. మన ఆలోచనని కథ కింద వ్రాయడం, కథని స్క్రీన్ కి అడాప్ట్ చెయ్యడం, స్క్రీన్ ప్లే ని తెర మీద చూపించడం, అంటే ఆ ప్రోసెస్ కి దర్శకత్వం వహించడం. ఈ మూడు పనులు ముగ్గురు మనుష్యులు కనుక చేస్తుంటే వాళ్ళ మధ్య స్పష్టమైన అవగాహన ఉండి తీరాలి. వాళ్ళు ఆలోచించే తీరు కొంతవరకైనా కలవాలి. ఈ సమన్వయం సరిగ్గా కుదిరిన రోజు సినిమా తియ్యడం అనేది ఒక అందమైన ప్రయాణం అవుతుంది. ఆ సమన్వయం కోసమే నా సినిమాలకి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలు అన్నీ నేనే వహిస్తూ ఉంటాను. అన్నిసార్లు నేను సక్సెస్ సాధించకపోవచ్చు. పరిస్థితుల ప్రభావం వల్ల మన నియమాలు కొంతవరకు సడలించవల్సి రావచ్చు. కేవలం ఒక వర్గం కోసమే కొన్నిసార్లు సినిమాలు తియ్యవల్సి రావచ్చు. కానీ నాలోని క్రిటిక్ ని సంతృప్తి పరిచే సినిమా కనీసం మూడు సంవత్సరాలకి ఒకటైనా తీస్తూ ఉంటాను."

"అందువల్ల నేను చెప్పేది ఏమిటంటే మీ ఇద్దరి మధ్య సరైన అవగాహన ఉందని మీరు నమ్మితే కథ మీద, కథనం మీద కలిసి పని చెయ్యండి. లాజిక్ అనే అద్దంలో మీ ప్రతీ ఆలోచనని ఎక్స్ పోజ్ చెయ్యండి. అహాన్ని పూర్తిగా వెనక్కి నెట్టి ఒకరి ఆలోచనా విధానంలో ఉన్న లోపాలని ఇంకొకళ్ళు ఎండగట్టండి. కలిసి కష్ట పడండి. కష్టపడి పైకి రండి. ఇప్పుడు మీకు డైరెక్ట్ గా నేనే హెల్ప్ చెయ్యను. కానీ ఒక ఆఫర్ ఇస్తాను. రేపటి నుండి ఒక సంవత్సరం పాటు రోజూ పొద్దున్నే ఏడు గంటలకి నా ఆఫీసుకి రండి. (మహారథి వైపు చూస్తూ) రైటర్ అవుదామనుకుంటున్న నువ్వు నా పాత సినిమాల స్క్రిప్టులు వారానికి ఒకటి చొప్పున చదివి కథా స్వరూపం మారకుండా ప్రతీ స్క్రిప్టులోనూ ఐదు కొత్త సన్నివేశాలను సజెస్ట్ చెయ్యాలి. ఆ సన్నివేశాలలోని పాత్రలు, వాటి

సంభాషణలు అన్నీ సిద్ధం చెయ్యాలి. (అతిరథి వైపు తిరిగి) అప్పుడు నువ్వు ఆ సీన్లు యాడ్ చెయ్యడం వల్ల లాభం ఉందో లేదో డిసైడ్ చేసి, ఉంటే వాటిని ఎక్కడ కలపవచ్చు, ఎలా డైరెక్ట్ చేద్దామనుకుంటున్నావు అంతా అనుకుని రెడీగా ఉండాలి. నేను నెలకి రెండు గంటలు మీ వర్క్ ని చూడ్డానికి కేటాయిస్తాను. మొదటి మూడు నెలల్లో మీ పనితనం నాకు నచ్చకపోతే ఆ తర్వాతి నెల నుండి మీరు రానవసరం ఉండదు. ఒకవేళ నన్ను మీరు ఇంప్రెస్ చెయ్యగలిగితే నా సినిమాలలో కొన్ని సీన్లు వ్రాసే అవకాశం నీకు (మహారథి వైపు చూస్తూ), ఆ సీన్లని డైరెక్ట్ చేసే అవకాశం నీకు (అతిరథి వైపు చూస్తూ) ఇస్తాను. మీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి నాకు తెలుసు. అందుకే ఇద్దరికీ నెలకి తలో మూడు వేలు ఇస్తాను. ఏమంటారు?" అని గుక్కతిప్పుకోకుండా గంట సేపు మాట్లాడి సౌమిత్రి ఇద్దరి వైపు ప్రశ్నార్థకంగా చూసాడు.

అతిరథ, మహారథులిద్దరూ ఆశ్చర్యానందాలతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఎంత ప్రయత్నించినా ఇద్దరి నోళ్ళూ పెగలలేదు. కాసేపటికి మహారథి మాట్లాడుతూ "చాలా చాలా సంతోషం సార్. అడగకుండానే చాలా వరాలిచ్చారు. మీ సలహాలు మాకు ఒక జీవిత కాలం మార్గదర్శకంగా నిలుస్తాయి." అన్నాడు.

వెంటనే అతిరథి అందుకుంటూ "అవున్సార్. మీరు చెప్పినట్టే కలిసి కష్టపడతాం. కష్టపడి పైకొస్తాం. మీ వరాలకి మేము అర్హులమని నిరూపిస్తాం." అని రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టాడు.

సౌమిత్రి ప్రతి నమస్కారం చేస్తూ "చాలా సంతోషం." అన్నాడు.

సరిగ్గా అలారం కొట్టినట్టు వీళ్ళ మాటలు పూర్తవగానే అభినివేష్ టీనూ ని తీసుకు వచ్చాడు. రూములోకి వస్తూనే 'డాడీ' అంటూ వాళ్ళ నాన్న దగ్గరికి పరిగెత్తాడు టీనూ.

'పనయిందా..' అన్నట్టు ఇద్దరి వైపు చూసాడు అభినివేష్.

'మా మొహాలు చూస్తే తెలియడం లేదా..' అన్నట్టు నవ్వు మొహం పెట్టారు ఇద్దరూ.

అభినివేష్ మాట్లాడుతూ "సరే అంకుల్, మరి మేము వెళ్ళొస్తాం." అన్నాడు.

అతిరథ, మహారథులు కూడా లేచి నిలబడి "చాలా థ్యాంక్స్ సార్. రేపు పొద్దున్నే ఏడు గంటలకి మళ్ళీ కలుస్తాం." అన్నారు.

"సరేనయ్యా, వెళ్ళిరండి. నా అసిస్టెంట్ కి చెప్పి ఉంచుతా. రేపు వచ్చి డైరెక్ట్ గా తనని కలవండి." అని చెప్పి, అభినివేష్ వైపు తిరిగి "అభీ, నువ్వు ఒక సెకను లోపలికి రా." అని పిల్లాడిని ఎత్తుకుని లోపలకి నడిచాడు సౌమిత్రి.

"మీరు నడుస్తూ ఉండండి.." అని ఇద్దరికీ చెప్పి ఆయన వెంట నడిచాడు అభినివేష్.

లోపలికి వెళ్ళాకా మెల్లగా "చూడు అభి. రాత్రి నాన్నగారు చెప్పారు. వాళ్ళిద్దరికీ ప్రతి నెలా తలో మూడు వేలు ఇవ్వమని, మనం తర్వాత చూసుకుందామని. ఆయనతో చెప్పు. ఆయన నాకు చేసిన ఉపకారం ముందు నేను చేస్తున్నది చాలా చిన్న సహాయం అని. సరేనా?" అన్నాడు సౌమిత్రి.

ఊహించని ఈ సహాయానికి, అన్నిటికన్నా మించి వాళ్ళ నాన్నగారి మంచి మనసుకి చాలా సంతోషించాడు అభినివేష్. "అలాగే అంకుల్, మళ్ళీ కలుస్తా.." అని చెప్పి వేగంగా బయటకి పరిగెత్తాడు, ఈ శుభవార్త వాళ్ళకి చెప్పాలని. బయట ఇద్దరూ బండికి చెరో వైపు నిల్చుని ఉన్నారు. పరిగెత్తుకు వస్తున్న అభినివేష్ ని చూసి నవ్వు మొహం పెట్టారు. వస్తూనే అభినివేష్ "ఒరే, మీకు ఇంకో గుడ్ న్యూస్. మనం ఊహించనిది. మీ ఇద్దరికీ సౌమిత్రి గారు నెలకి తలో మూడు వేలు ఇస్తానన్నారు." అని ఇద్దరి వైపు 'ఇక ఎగరండి. నేనే మీ అనుకోను..' అన్నట్టు నవ్వుతూ చూసాడు. ఇద్దరూ ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకుని సడెన్ గా అభినివేష్ ని పైకెత్తి, "నిజమా, చాలా చాలా థ్యాంక్స్ రా." అన్నారు. అతిరథి మాట్లాడుతూ "నీ మేలు ఈ జన్మలో మర్చిపోలేము. ఈ సంతోషాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి. పదరా." అన్నాడు.

అభినివేష్ చాలా ఆనంద పడుతూ "తప్పకుండారా. మరి ఇద్దరిలో ఒక్కరైనా పర్స్ తెచ్చారా?" అని అడిగాడు.

మహారథి సమాధానం చెప్తూ "మేము తెచ్చినా, తేకపోయినా ఒకటేరా. అందుకే ఈ సారి కూడా నీకే

అవకాశం ఇస్తున్నాం." అని నవ్వుతూ అభిసివేష్ వైపు చూసాడు.
అభిసివేష్ కోపాన్ని తెచ్చిపెట్టుకుంటూ "ఇది దారుణం రా. ఇప్పుడు కూడా నేనే పెట్టాలా?" అన్నాడు.
అతిరధి అందుకుంటూ "ఇదే చివరి సారిరా. నీకు మళ్ళీ ఆ అవకాశం కూడా రాదు. పద, పద."
అంటూ బయలుదేర దీసాడు.

* * *

చేతక్ మీద ముగ్గురూ రయ్ మని దూసుకుపోతున్నారు గంటకి పదిహేను కిలోమీటర్ల వేగంతో.
మధ్యలో కూర్చున్న అతిరధి అడిగాడు అభిసివేష్ ని. "ఏరా అభీ, ఫ్లాష్ న్యూస్ అంటే ఏమిట్రా?"
"అది కూడా తెలియదా. అప్పుడే జరిగిన ఒక సంఘటనకి సంబంధించిన న్యూస్. ఇంతకీ ఎందుకడిగావు?"
"అబ్బే ఏం లేదులే. ఊరికే అడగాలనిపించింది.." అని వెనక్కి తిరిగి మహారధిని చూసి కన్నుగీటాడు అతిరధి.
మహారధి నవ్వు మొహం పెట్టి తప్పన్నట్టుగా ముక్కు మీద వేలు వేసుకున్నాడు.

***శుభం***

18 April 2004